క్లుప్తంగా

విద్యుత్ తీగలు సరిచేశారు



వేలాడుతున్న తీగలను సరిచేస్తున్న సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్..

దండేపల్లి: మండల కేంద్రం సమీపంలో ఓ పంట పొలంలో విద్యుత్ తీగలు చేయి పైకెత్తితే తాకేలా వేలాడుతూ ప్రమాదకరంగా ఉన్నాయి. దీనిపై 'చేతికందేలా విద్యుత్ తీగలు' అనే కథనం సాక్షిలో బుధవారం ప్రచురితమైంది. దీనిపై విద్యుత్ అధికారులు స్పందించి, వేలాడే విద్యుత్ తీగలను సిబ్బందితో సరిచేయించారు.

జూలై 2న వాహన సామగ్రి వేలం

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం గుడిపేట 13వ ప్రత్యేక పోలీస్ బెటాలియన్‌లో వినియోగించిన వాహనాల సామగ్రిని జూలై 2వ తేదీ ఉదయం 10గంటలకు బెటాలియన్‌లో బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు కమాండెంట్ సయ్యద్ జమీల్ భాషా బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. బెటాలియన్‌లో వినియోగించిన వాహనాల పాత టైర్లు, ట్యూబులు, పాత బ్యాటరీలు, వినియోగించిన ఇంజన్ ఆయిల్, పాత వాహనాల సామగ్రి మొత్తం వేలం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి గలవారు ఈ వేలానికి సకాలంలో హాజరై నిబంధనల మేరకు వేలంలో పాల్గొనాలని తెలిపారు.

చిమ్మచీకట్లో వేమనపల్లి

వేమనపల్లి: నెల రోజులుగా వేమనపల్లి మండల కేంద్రం కారుచీకట్లో మగ్గిపోతుంది. గ్రామంలోని బస్టాండ్ ప్రాంతం, పాత బస్టాండ్, పీహెచ్‌సీ వీధుల్లో హైమాక్స్ లైట్లు అమర్చిన సాంకేతిక లోపంతో అవి వెలగడం లేదు. పలువాడల్లోని విద్యుత్ దీపాలు వెలగక చీకటి పడిందంటే చీకట్లు కమ్ముకుంటున్నాయి. స్థానికులు పంచాయతీ కార్యదర్శికి, ప్రత్యేక అధికారికి ఎన్నిసార్లు విన్నవించినా ఫలితం లేకుండా పోయింది. మండల కేంద్రం కావడంతో ప్రభుత్వ కార్యాలయాలకు నిలయంగా ఉంది. పొద్దుపోయిందంటే కార్యాలయాల ఆవరణలు చీకట్లో మగ్గుతున్నాయి. ప్రభుత్వం నుంచి నిధులు రాక, వీధి దీపాల నిర్వహణ ఇబ్బందిగా మారిందని అధికారులు తెలుపుతున్నారు. వర్షాకాలం కావడంతో వీధి దీపాల నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

కంటి వైద్య శిబిరం సద్వినియోగం చేసుకోండి

చెన్నూర్: పట్టణంలోని సాయిరాం ఫంక్షన్ హాల్‌లో ఈ నెల 28న బాస్కర్ మడేకర్ చారిటబుల్ కంటి ఆసుపత్రి, గర్మిళ్ల లయన్స్ క్లబ్ మంచిర్యాల సంయుక్తంగా నిర్వహిస్తున్న ఉచిత కంటి వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ అర్చనరాంలాల్‌గిల్డా అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం ఆవరణలో బుధవారం ఉచిత కంటి వైద్య శిబిరం పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ నవాజ్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

వాడీవేడిగా మండల సమావేశం

మందమర్రిరూరల్: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం మండల సర్వసభ్య సమావేశం వాడివేడిగా జరిగింది. ఎంపీపీ గుర్రం మంగ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి జెడ్పీ చైర్‌పర్సన్ నల్లాల భాగ్యలక్ష్మి హాజరయ్యారు. గౌరవ సభ్యులు గ్రామీణ ప్రాంత సమస్యలను విన్నవించారు. సరైన వైద్యం అందుబాటులో ఉండడం లేదని, అత్యవసర పరిస్థితుల్లో బాధితులను మంచిర్యాల ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లే సమయంలో వైద్యం అందక అనేక మంది చనిపోతున్నారని మందమర్రిలోని సింగరేణి ఆసుపత్రిలో వైద్య సేవలందే విధంగా చూడాలని కో ఆప్షన్ మెంబర్ నసీరొద్దీన్ డిమాండ్ చేశారు. పలు సమస్యలపై తీర్మానం చేశారు. సమావేశంలో వైస్ ఎంపీపీ రాజ్‌కుమార్, పీఏసీఎస్ చైర్మన్ ప్రభాకర్‌రావు, ఎంపీడీవో రాజేశ్వర్, తహసీల్దార్ చంద్రశేఖర్, ఎంపీటీసీలు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

భగీరథ నీరు డ్రెయినేజీ పాలు..!



చెన్నూర్: పట్టణంలోని శ్రీ సరస్వతీ శిశుమందిర్ సమీపంలో ఏర్పాటు చేసిన మిషన్ భగీరథ నీరు లీకై డ్రెయినేజీ పాలవుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. అధికారులు స్పందించి లీకవుతున్న పైపులకు మరమ్మతులు చేసి నీరు సక్రమంగా సరఫరా చేయాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

మాదక ద్రవ్యాలకు బానిస కావొద్దు



జైపూర్: ప్రతిజ్ఞ చేస్తున్న ఏసీపీ వెంకటేశ్వర్లు, సీఐ



సబ్బెపల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న హాజీపూర్ పోలీసులు



భీమారంలో అవగాహన కల్పిస్తున్న ఎస్సైరాములు



తాండూర్: ప్రజలతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎస్సైలు



జన్నారం: ర్యాలీ తీస్తున్న ఎస్సై, విద్యార్థులు



మందమర్రిరూరల్: ప్రతిజ్ఞ చేయిస్తున్న బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్, పక్కన ఏరియా జీఎం మనోహర్

- ఘనంగా అంతర్జాతీయ మాదక ద్రవ్య వ్యతిరేక దినోత్సవం
- పోలీసులు, ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో అవగాహన

బెల్లంపల్లి/తాండూర్/లక్సెట్టిపేట/దండేపల్లి/చెన్నూర్/భీమారం/జన్నారం/కోటపల్లి/కాసిపేట/భీమిని/జైపూర్/మందమర్రిరూరల్/శ్రీరాంపూర్/రామకృష్ణాపూర్/మంచిర్యాలరూరల్(హాజీపూర్): అంతర్జాతీయ మాదక ద్రవ్య వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం జిల్లా వ్యాప్తంగా పోలీసుల ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. పలు పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు, ఉపాధ్యాయులు ర్యాలీలు తీశారు. బెల్లంపల్లి, మందమర్రిలో జరిగిన కార్యక్రమాల్లో ఏసీపీ ఎ.రవికుమార్ మాట్లాడుతూ మాదక ద్రవ్యాల వినియోగం వల్ల మానవాళి మనుగడకు ముప్పు పొంచి ఉందని, మాదక ద్రవ్యాలకు బానిస కావొద్దని సూచించారు. డ్రగ్స్ వాడకం వల్ల ఎన్నో దుష్పరిణామాలు ఉంటాయని, సాధ్యమైనంత వరకు డ్రగ్స్ వాడకుండా ప్రతి ఒక్కరూ స్వీయ నియంత్రణ పాటించాలన్నారు. గంజాయి మహమ్మారిని పాలద్రోలడానికి ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా ముందుకు రావాలని కోరారు. జైపూర్‌లో ఏసీపీ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఎవరైనా మత్తుపదార్థాలు రవాణా చేసినా, మత్తుపదార్థాలు వాడినా పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. మందమర్రిలో ఏరియా జీఎం మనోహర్ హాజరై మాట్లాడుతూ.. డ్రగ్స్ ఫ్రీ రాష్ట్రంగా చేయడానికి ప్రభుత్వం గట్టి చర్యలు చేపట్టిందన్నారు. ఆయా కార్యక్రమాల్లో బెల్లంపల్లిలో ఎక్సైజ్ సీఐ జె.ఇంద్రప్రసాద్, వన్‌టౌన్ ఎస్‌హెచ్‌ఓ ఎన్.దేవయ్య, బెల్లంపల్లి రూరల్ సీఐ అఫ్జలుద్దీన్, ఎస్సైలు రమేష్, జీ.నరేష్, తాండూర్, మాదారంలో జరిగిన కార్యక్రమాల్లో ఎస్సైలు సీ.హెచ్.కిరణ్‌కుమార్, అనూష, అడిషనల్ ఎస్సై తిరుమల, ఏఎస్సై లక్ష్మణ్, లక్సెట్టిపేట పట్టణ సీఐ నరేందర్, దండేపల్లిలో ఎస్సై భూమేష్, చెన్నూర్‌లో సీఐ రవీందర్, ఎస్సైలు శ్వేత, వెంకటేశ్వర్, సుమలత, భీమారంలో ఎస్సై బి.రాములు, జన్నారంలో ఎస్సై రాజవర్ధన్, కోటపల్లిలో సీఐ సుధాకర్, కాసిపేటలో దేవాపూర్ ఎస్సై ఆంజనేయులు, భీమిని, కన్నెపల్లిలో ఎస్సైలు విజయ్‌కుమార్, గంగారాం, హాజీపూర్‌లో ఎస్సై గోపతి సురేశ్, నెన్నెల ఎస్సై ప్రసాద్, జైపూర్‌లో శ్రీరాంపూర్ సీఐ మోహన్, ఎస్సై శ్రీధర్, అదనపు ఎస్సై నాగరాజు, మందమర్రిలో సీఐ శశిధర్‌రెడ్డి, పట్టణ ఎస్సై రాజశేఖర్, శ్రీరాంపూర్‌లో సీఐ మోహన్, ఎస్సై సంతోష్, సీసీసీ నస్పూర్‌లో ఎస్సై రవికుమార్, రామకృష్ణాపూర్‌లో పట్టణ ఎస్సై రాజశేఖర్, ఉపాధ్యాయులు, పోలీసులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



కన్నెపల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు



నెన్నెలలో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎస్సై, ఉపాధ్యాయులు



కోటపల్లిలో ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు



లక్సెట్టిపేట: మాట్లాడుతున్న సీఐ నరేందర్



చెన్నూర్: అంబేడ్కర్ చౌరస్తాలో ప్రతిజ్ఞ



దండేపల్లి: ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు, పాల్గొన్న ఎస్సై, ఉపాధ్యాయులు



కాసిపేట: విద్యార్థులతో ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు, ఉపాధ్యాయులు



బెల్లంపల్లి: ర్యాలీ తీస్తున్న పోలీసులు, విద్యార్థులు

ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు న్యాయం చేయాలి



హరీశ్‌చంద్రరెడ్డికి వినతిపత్రం ఇస్తున్న ఉద్యోగులు

మంచిర్యాలటౌన్: స్థానిక ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో గత 17సంవత్సరాలకు పైబడి ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో పనిచేస్తున్న తమకు న్యాయం చేయాలని కోరుతూ 9మంది ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు బుధవారం ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ హరీశ్ చంద్రరెడ్డి, ఆర్ఎంవో శ్రీమన్నారాయణలకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తమను రెన్యూవల్ చేయకుండా, మా స్థానంలో కొత్త వారిని ఎంపిక చేసేందుకు గాను మార్చి 15న 72పోస్టులకు గాను ప్రకటన ఇచ్చారన్నారు. ఆ ప్రకటనతో తాము కూడా ఉద్యోగానికి దరఖాస్తు చేసుకున్నామని, తమకు మొదటి ప్రాధాన్యం ఇచ్చి ఉద్యోగంలోకి తిరిగి తీసుకుని న్యాయం చేయాలని కోరారు. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు గుండా విజయ్ కుమార్, కొల్లూరి గాయత్రి, కాశెట్టి మధుకర్, వేల్పుల రవీందర్, మంతెన అశ్విన్ కుమార్, చింతపండు సంతోశ్, బి. మానస, కుమ్మరి శంకర్, మిన్నపూరి సంపత్ పాల్గొన్నారు.

నేటి నుంచి రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ పోటీలు



ఏర్పాట్లు పరిశీలిస్తున్న అసోసియేషన్ సభ్యులు

మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రంలోని గ్రీన్‌సిటీలో గల మాస్టర్స్ బ్యాడ్మింటన్ అకాడమీలో ఈ నెల 27వ తేదీ నుంచి 30వ తేదీ వరకు జరిగే యూనిక్స్ సన్‌రైస్ సీనియర్స్ రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ పోటీలకు బ్యాడ్మింటన్ అసోసియేషన్ సభ్యులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. రాష్ట్రస్థాయి పోటీల కోసం చేసిన ఏర్పాట్లను బుధవారం బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ జాయింట్ సెక్రటరీ యూవీఎన్ బాబు, టోర్నమెంట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ పుల్లూరు సుధాకర్, మ్యాచ్ కంట్రోలర్ కుమార్, అసోసియేషన్ ట్రెజరర్ సత్యపాల్ రెడ్డి, వైస్ ప్రెసిడెంట్‌లు భాస్కర్ల వాసు, బండ మీనారెడ్డి, జాయింట్ సెక్రటరీలు రమేశ్ రెడ్డి, మధు, సభ్యులు కృష్ణ, రవిలు పరిశీలించారు.

మున్సిపాలిటీ అభివృద్ధికి కౌన్సిల్ తీర్మానం



మాట్లాడుతున్న చైర్‌పర్సన్ అర్చనరాంలాల్‌గిల్డా

చెన్నూర్: మున్సిపాలిటీలో అభివృద్ధి పనులకు కౌన్సిల్ తీర్మానం చేసినట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ అర్చనరాంలాల్‌గిల్డా అన్నారు. చైర్‌పర్సన్ అధ్యక్షతన బుధవారం మున్సిపల్ సాధారణ సమావేశం జరిగింది. సమావేశంలో పట్టణంలో తాగునీటి సరఫరా కోసం బతుకమ్మ వాగు వద్ద గల సంప్ మరమ్మతులు, వాటర్ ట్యాంకర్ కొనుగోలు, బతుకమ్మ వాగు నుంచి పట్టణానికి కొత్త పైపు లైన్ నిర్మాణం, మురికి కాలువ మరమ్మతులకు 2024–25 సంవత్సరానికి నర్సరీ అభివృద్ధి కోసం కౌన్సిలర్లు తీర్మానం చేశారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ.. రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని వార్డులలో వీధి దీపాలు ఏర్పాటు చేయాలన్నారు. పారిశుధ్య నిర్వహణ చేపట్టాలని సూచించారు. వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలలో భాగంగా ట్యాప్‌ల ద్వారా స్వచ్ఛ నీటి సరఫరా చేసేందుకు అధికారులు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ గంగాధర్, ఏఈ సాయికిరణ్, వైస్ చైర్మన్ నవాజ్, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

పాఠశాలలో ప్రవేశం కోసం విద్యార్థుల ర్యాలీ



బజారుఏరియాలో ర్యాలీ తీస్తున్న విద్యార్థులు

బెల్లంపల్లి: ప్రభుత్వ పాఠశాలలో ప్రవేశం కోసం బుధవారం బెల్లంపల్లిలో విద్యార్థులు, ఉపాధ్యాయులు ర్యాలీ చేశారు. పాత బస్టాండ్ ఏరియాలో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు పాఠశాల నుంచి బజారు ఏరియా పుర వీధుల మీదుగా ఫ్లకార్డులతో ప్రదర్శన చేశారు. విద్యార్థులను తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ... జిల్లా పరిషత్ పాఠశాలలో 6 నుంచి 10వ తరగతి వరకు అడ్మిషన్లు జరుగుతున్నాయని తెలిపారు. ఆంగ్లమాధ్యమంలో బోధన చేస్తున్నామని, విద్యార్థులు బంగారు భవిష్యత్ కోసం జిల్లా పరిషత్ పాఠశాలలో చేర్పించాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సమస్యలపై నిలదీత

బెల్లంపల్లిరూరల్: బెల్లంపల్లి మండల సర్వసభ్య సమావేశం గరంగరంగా సాగింది. మండల పరిషత్ అధ్యక్షుడు గోమాస శ్రీనివాస్ అధ్యక్షతన బుధవారం మండల సాధారణ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశానికి జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ తొంగల సత్యనారాయణ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సమావేశంలో సభ్యులు ప్రజా సమస్యలను ప్రస్తావించి అధికారుల పనితీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామాలకు వెళ్లే ప్రధాన రహదారిని ఆనుకొని పీహెచ్‌సీ పక్కన మత్తు పదార్థాలు కలిపి కల్లు విక్రయిస్తున్నా తనిఖీలు చేసి విక్రయదారులపై చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ తొంగల సత్యనారాయణ ఎక్సైజ్ ఎస్సై వెంకటేష్‌పై మండిపడ్డారు. నాటుసారా తయారీ, అమ్మకాలు జోరుగా జరుగుతున్నాయని వీటి నియంత్రణ కోసం పట్టించుకోవడం లేదెందుకని పలువురు సభ్యులు ఎక్సైజ్ ఎస్సైపై ప్రశ్నల వర్షం కురిపించారు. గ్రామాల్లో విద్యుత్ సమస్యలు కోకొల్లలుగా ఉన్నా పట్టించుకోవడం లేదని డిస్కం రూరల్ ఏఈ రామ్ మనోహర్‌ను సభ్యులు నిలదీశారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి ప్రభుత్వ అధికారులు తగిన చర్యలు వెంటనే చేపట్టాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎంపీపీ, వైస్ ఎంపీపీ, ఎంపీటీసీ సభ్యులను ప్రభుత్వ శాఖల అధికారులు పూలమాల వేసి శాలువా కప్పి సన్మానం చేశారు. సమావేశంలో ఎంపీడీవో మహేందర్, వైస్ ఎంపీపీ రాణి, ఎంపీటీసీ సభ్యులు సుభాష్‌రావు, మల్లమ్మ, అంకు, శకుంతల, కో ఆప్షన్ సభ్యుడు చాంద్‌పాషా, ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.

అదనపు కలెక్టర్ రాహుల్‌కు వీడ్కోలు



అదనపు కలెక్టర్‌ను సన్మానిస్తున్న టీఎన్జీవోస్ సభ్యులు

మంచిర్యాలటౌన్: జిల్లా అదనపు కలెక్టర్(స్థానిక సంస్థలు)గా విధులు నిర్వర్తించి, భద్రాచలం ఐటీడీఏ పీవోగా బదిలీపై వెళ్తున్న బి.రాహుల్‌ను బుధవారం టీఎన్జీవోస్ జిల్లా నాయకులు వీడ్కోలు సమావేశం నిర్వహించి సన్మానం చేశారు. కార్యక్రమంలో టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు గడియారం శ్రీహరి, కార్యదర్శి భూముల రామ్మోహన్, కేంద్ర సంఘం కార్యదర్శి పొన్న మల్లయ్య, జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు శ్రీపతి బాపురావు, ఉపాధ్యక్షులు తిరుపతి, రామ్‌కుమార్, సంయుక్త కార్యదర్శి సునిత, ఆర్గనైజింగ్ సెక్రటరీ శ్రావణ్ పాల్గొన్నారు.

పంచాయతీ ఉద్యోగుల ఆధ్వర్యంలో..

మంచిర్యాలరూరల్(హాజీపూర్): మంచిర్యాల జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి.రాహుల్ భద్రాచలం జిల్లా ఐటీడీఏ పీఓగా బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా ఐడీఓసీలో ఏర్పాటు చేసిన వీడ్కోలు సమావేశంలో రాహుల్‌ను మండల పంచాయతీ అధికారుల సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఎన్నికల విషయంలోనే కాకుండా పంచాయతీ రాజ్ వ్యవస్థలో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ఎప్పటికప్పుడు స్పందిస్తూ, అన్నింటా అగ్రగామిగా నిలపారని అంతా ప్రసంశించారు. వీడ్కోలులో కలెక్టర్ కుమార్‌దీపక్‌తో పాటు రెవెన్యూ అదనపు కలెక్టర్ మోతీలాల్, డీపీవో వెంకటేశ్వర్‌రావు, డీఆర్‌డీవో కిషన్, డీఎల్‌పీవో సఫ్దర్ అలీ, మండల పంచాయతీ అధికారుల సంఘం జిల్లా కార్యదర్శి అజ్మత్‌అలీ, డీపీఎం నరేందర్, మండల పంచాయతీ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, ఈ–పంచాయతీ ఆపరేటర్లు, ఈజీఎస్ ఏపీఓలు పాల్గొన్నారు.

తాగునీటి సరఫరాలో ఇబ్బంది లేకుండా చూడాలి



పనులు పరిశీలిస్తున్న ఏరియా జీఎం మనోహర్

మందమర్రిరూరల్: మందమర్రి పట్టణంలోని సింగరేణి ఏరియాల్లో నివసిస్తున్న ప్రజలకు తాగునీటికి ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడాలని సంబంధిత అధికారులను ఏరియా జీఎం మనోహర్ ఆదేశించారు. చెల్లాపూర్ సమీపంలో సింగరేణి ఆధ్వర్యంలో నిర్మిస్తున్న నీటి సరఫరా పైపులైన్ పనులను బుధవారం సందర్శించారు. పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. సివిల్ అధికారులు శ్రీనివాసులు, శ్రీధర్, సిబ్బంది ఉన్నారు.

సంక్షిప్త వార్తలు

ఆసరా పెన్షన్లు అందించాలి

శ్రీరాంపూర్: సింగరేణి రిటైర్డ్ ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం ఆసరా పెన్షన్లను వర్తింపజేయాలని సింగరేణి రిటైర్డ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు డిమాండ్ చేశారు. హైదరాబాదులోని ఈసీఐఎల్ ఓ కార్యాలయంలో బుధవారం జరిగిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డీ.రామచంద్రరావు, ప్రధాన కార్యదర్శి బానయ్య, ఉప ప్రధాన కార్యదర్శి ఏ వేణుమాదవ్‌లు పాల్గొని మాట్లాడారు.

'అంక్షలు ఎత్తి వేయాలని పాదయాత్ర'

జన్నారం: కవ్వాల్ టైగర్ జోన్‌లో జన్నారం అటవీ డివిజన్‌ప్రాంతంలో భారీ వాహనాలపై విధించిన అంక్షలు ఎత్తివేయాలని కోరుతూ చేపట్టిన పాదయాత్ర బుధవారం మొర్రిగూడలో కొనసాగింది.

28న బీఎంఎస్ సమావేశం

శ్రీరాంపూర్: ఈ నెల 28న బీఎంఎస్ శ్రీరాంపూర్ ఏరియా జనరల్ బాడీ సమావేశం జరుగనుందని ఆ యూనియన్ బ్రాంచీ కార్యదర్శి నాతాడి శ్రీధర్ రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

వర్షాలు కురువాలని పూజలు

రామకృష్ణాపూర్: వర్షాలు బాగా రావాలని తద్వారా పంటలు సంవృద్ధిగా పండాలని ఆకాంక్షిస్తూ మందమర్రి మండలం బొక్కలగుట్ట గ్రామస్తులు బుధవారం గ్రామదేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

'సూపర్ స్పెషాల్టీ హాస్పిటల్ నిర్మించాలి'

జైపూర్: స్థానిక సింగరేణి థర్మల్ పవర్ ప్లాంటు పరిసర ప్రాంత ప్రజల సౌకర్యార్థం హాస్పిటల్, హైస్కూల్ నిర్మించాలని హెచ్ఎంఎస్ రాష్ట్ర అధ్యక్షులు రియాజ్ అహ్మద్ డిమాండ్ చేశారు.

పాఠశాలల బంద్

చెన్నూర్: పాఠశాలలు ప్రారంభమై పక్షం రోజులైనా ఇప్పటికీ పాఠ్య పుస్తకాలు పంపిణీ చేయలేదని ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు మామిడి అక్షిత అన్నారు. విద్యా సమస్యలు పరిష్కరించాలనే డిమాండ్‌తో ఏబీవీపీ ఇచ్చిన రాష్ట్ర వ్యాప్త పాఠశాలల బంద్‌లో భాగంగా చెన్నూర్ పట్టణంలో ప్రైవేట్, ప్రభుత్వ పాఠశాలలు బంద్ చేశారు.

చిన్నారులకు అర్థమయ్యేలా బోధించాలి

భీమిని: అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారులకు వారికి అర్థమయ్యే విధంగా బోధించాలని సీడీపీవో ఉమాదేవి అన్నారు. అంగన్‌వాడీలకు బుధవారం శిక్షణ ముగింపు కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రంలో ఆటపాటలతో చిన్నారులకు విద్యను అందించాలన్నారు. పిల్లలకు సరైన పౌష్టికాహారం అందించాలని సూచించారు.

చైర్మన్‌కు సన్మానం

లక్సెట్టిపేట: వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా ఎన్నికైన దాసరి ప్రేమ్‌చంద్‌ను మండలంలోని అంబేడ్కర్ సంఘం నాయకులు బుధవారం స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో శాలువాలతో ఘనంగా సన్మానం చేశారు. రైతుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలన్నారు.

పంట వివరాలు పక్కాగా నమోదు చేయాలి



రైతులకు సూచనలు చేస్తున్న ఏవో

తాండూర్: వానాకాలంలో రైతులు సాగు చేస్తున్న పంటల వివరాలను పక్కాగా నమోదు చేయాలని మండల వ్యవసాయ అధికారిణి కిరణ్మయి అన్నారు. తాండూర్ క్లస్టర్ పరిధి మాదారంలో బుధవారం సాగు చేస్తున్న పంటల వివరాల నమోదు ప్రక్రియను ఆమె స్వయంగా వెళ్లి పరిశీలించారు. ప్రతి రైతు ఏఈవోలకు సహకారం అందించాలని కోరారు. ఏవో వెంట ఏఈవో పుష్ప ఉన్నారు.

కోతుల బెడద తగ్గించాలి

చెన్నూర్: మున్సిపాలిటీలో కోతుల బెడద తీవ్రంగా ఉందని కోతుల నివారణ చర్యలు చేపట్టాలని కోరుతూ మున్సిపల్ కౌన్సిలర్లు కమ్మల శ్రీనివాస్, జాడి సురేఖ, గర్రెపల్లి శాంతరాణి, కో ఆప్షన్ సభ్యులు కేవీఎం శ్రీనివాస్ మున్సిపల్ కమిషనర్ గంగాధర్, చైర్‌పర్సన్ అర్చనారాంలాల్‌గిల్డాలకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కోతులు ఇళ్లలో చొరబడి నానా బీభత్సం సృష్టిస్తున్నాయని పేర్కొన్నారు. కోతుల తీవ్రత ఎక్కువ కావడంతో పట్టణ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. గతంలో మున్సిపాలిటీలో పందులు, కుక్కలు, కోతుల నివారణ చర్యల్లో భాగంగా రూ.90వేలు కేటాయించినా, నేటికీ కార్యరూపం దాల్చలేదన్నారు. ఉన్నతాధికారుల అనుమతి తీసుకొని మున్సిపల్ అధికారులు కోతుల నివారణ చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు పాల్గొన్నారు.